ఇఫ్తార్ విందు మతసామరస్యానికి ప్రతీక

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్


ఇఫ్తార్ విందులో పాల్గొన్న అంజన్‌కుమార్ యాదవ్, శ్రీశైలం యాదవ్, శ్రీకాంత్‌యాదవ్

కవాడిగూడ: మతసామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందు నిలుస్తుందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. శాంతిసామరస్యానికి మహ్మద్ ప్రవక్త బోధనలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. రంజాన్ మాసం పురస్కరించుకొని సీనియర్ కాంగ్రెస్ నాయకులు గట్ల శ్రీశైలం యాదవ్, గట్ల కరాటే శ్రీకాంత్ యాదవ్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం కవాడిగూడ లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ఆర్ కన్వెన్షన్ హాలులో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ విందులో అంజన్‌కుమార్ యాదవ్‌తోపాటు పార్టీ జూబ్లీహిల్స్ ఇన్‌చార్జి నవీన్ యాదవ్, ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, జనార్దన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కల్పనాయాదవ్, పట్నం నాగభూషణంగౌడ్, కవాడిగూడ, భోలక్‌పూర్, గాంధీనగర్, అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు పోతరాజు భాస్కర్, ఉమర్ గౌస్, సాజిత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు మంచి భవిష్యత్తు


ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రతిభ గల విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని అంబేడ్కర్ విద్యా సంస్థల డైరెక్టర్ రిషికాంత్ అన్నారు. బుధవారం అంబేడ్కర్ కళాశాలలో ఎంబీఏ, డిగ్రీ విద్యార్థులకు మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో 10 కంపెనీలకుపైగా పాల్గొని 250 మంది విద్యార్థులను పరీక్షించాయి. ప్రతిభ కనబరిచిన 70 మంది విద్యార్థులకు వివిధ కంపెనీలలో ప్లేస్‌మెంట్స్ ఇచ్చారు. ఈ సందర్భంగా రిషికాంత్ మాట్లాడుతూ సృజనాత్మకతను కలిగిన విద్యార్థులకు మంచి అవకాశాలు లభించేలా తమ కళాశాల తరఫున కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ చాగంటి శ్రీనివాస్, మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగరాజు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మట్ట శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని ఓడించడమే సామాజిక శక్తుల కర్తవ్యం

ప్రముఖ అంబేడ్కర్‌వాది జేబీ రాజు


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జేబీ రాజు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశంలో బీజేపీని ఓడించడమే సామాజికశక్తుల కర్తవ్యం అని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, ప్రముఖ అంబేడ్కర్‌వాది జేబీ రాజు అన్నారు. బీజేపీ పాలనలో దళితులపై పెరిగిన దాడులు, దౌర్జన్యాలు అన్నీఇన్నీ కావని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో 'సార్వత్రిక ఎన్నికలు, సామాజిక శక్తుల కర్తవ్యం' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జేబీ రాజు మాట్లాడుతూ బీజేపీ సర్కార్ సామాజిక న్యాయాన్ని సమాధి చేస్తుందని విమర్శించారు. కేవీపీఎస్ నగర అధ్యక్షుడు ఎం.దశరథ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైల్యాబ్‌బాబు, టీపీఎస్‌కే కన్వీనర్ జి.రాములు, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆరేపల్లి రాజేందర్, బంధు సొసైటీ అధ్యక్షుడు పల్లెల వీరస్వామి, వివిధ సంఘాల నాయకులు డాక్టర్ సిద్దోజీరావు, మారెపాక అనిల్, పి.శంకర్, కోకల కిరణ్, ఎస్.బాలపీరు తదితరులు పాల్గొన్నారు.

సమానత్వం కోసం మహిళలు ఉద్యమించాలి


దళిత బహుజన ఫ్రంట్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ సుధారాణి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సమానత్వం కోసం మహిళలు ఉద్యమించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఈ.సుధారాణి అన్నారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ శ్రామిక దినోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సుధారాణి మాట్లాడుతూ పౌష్టికాహారం అందక తల్లులు, పిల్లలు మరణిస్తున్నారని అన్నారు. నేటికీ దేశంలో 31 శాతం మంది మహిళలు మాత్రమే రాజకీయాల్లో ఉన్నారని చెప్పారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని పరిరక్షించడంలో మహిళలు కూడా తమవంతు పాత్ర పోషించాలన్నారు. డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పీవోడబ్ల్యూ అధ్యక్షురాలు ఝాన్సీ, రజిత, డీబీఎఫ్ జాతీయ కన్వీనర్ పి.శంకర్, మంతెన రాయదాస్ దీప్తి, డాక్టర్ జిలకర శ్రీనివాస్, మీరా సంగమిత్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టంతోనే నాణ్యమైన విద్య


సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో విద్యాహక్కు చట్టం అమలుకు నోచుకోకపోవడం బాధాకరమని తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.యాదయ్యమాదిగ అన్నారు. బుధవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో మహా ఎమ్మార్పీఎస్, తెలంగాణ దండోరా, తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యాహక్కు చట్టం అమలు తీరుపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యాదయ్య మాదిగ మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం పూర్తిగా అమలైతేనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. విముక్తి చిరుతల పార్టీ తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడితే ప్రైవేటు విద్యాసంస్థలు బలహీనపడి ప్రభుత్వ విద్యా సంస్థలు మెరుగుపడతాయనుకుంటే అందుకు భిన్నంగా జరిగిందన్నారు. తెలంగాణ దండోరా వ్యవస్థాపక అధ్యక్షులు మీసాల రామన్నమాదిగ, మహా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు ముత్యాపాగ నర్సింగ్‌రావు మాదిగ, బహుజన రాజ్యాధికార సమితి అధ్యక్షులు పసుపాక నర్సింహ, వీసీకే ఉపాధ్యక్షులు మచ్చ దేవేందర్, తెలంగాణ విద్యార్థి కోఆర్డినేటర్ ఎల్లేష్, మహేష్‌బాబు, సోషల్ జస్టిస్ ఫోరం అధ్యక్షులు జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్యరంగంలో ఉపాధి అవకాశాలు అధికం


సెమినార్‌లో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ చెన్నప్ప

కాచిగూడ: వాణిజ్యరంగంలో విద్యార్థులకు విస్తృతమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ డి.చెన్నప్ప అన్నారు. బుధవారం కాచిగూడలోని బద్రుకా వాణిజ్య కళాశాలలో 'డిజిటల్ ఫైనాన్స్ – స్థిరమైన అభివృద్ధి కోసం ఒక వ్యూహం' అనే అంశంపై ఒక రోజు జాతీయ సదస్సును నిర్వహించారు. డిజిటల్ బ్యాంకింగ్‌తో ఆర్థిక లావాదేవీలు, పెట్టుబడులు, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ మరింత సులభతరమవుతుందని అన్నారు. ఈ సందర్భంగా సదస్సు బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. భారతీయ రిజర్వ్ బ్యాంకు నోట్ ముద్రన్ ప్రైవేట్ లిమిటెడ్ మాజీ ఎండీ ఖాజా సుధాకర్, పొల్వాయి విక్రమ్‌రెడ్డి, నాబార్డు మాజీ చీఫ్ జనరల్ మేనేజర్ కస్తూరి వెంకటేశ్వర్ రావు, ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, ప్రొఫెసర్ సీవీ రంజని, ప్రొఫెసర్ కె.సోమేశ్వర్ రావు, బద్రుకా కళాశాల సెక్రటరీ శ్రీకిషన్ భద్రుకా, అభిరామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.మోహన్ కుమార్, సదస్సు కన్వీనర్ డాక్టర్ ఎం.జానకిరామ్, డా. పి.వెంకటయ్య పాల్గొన్నారు.

కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో అడ్మిషన్ల గడువు పొడిగింపు

బంజారాహిల్స్: కేఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీలో వివిధ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం నిర్ణయించిన దరఖాస్తు గడువును మార్చి 29 వరకు పొడిగించారని ఆ యూనివర్సిటీ ప్రతినిధులు తెలిపారు. 2024 అకడమిక్ సెషన్‌లో భాగంగా కేఎల్ ఈఈఈ, కేఎల్‌శాట్, కేఎల్‌ఈసెట్, కేఎల్‌హ్యాట్, కేఎల్‌మ్యాట్ కోర్సుల్లో ప్రవేశాలకై దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఔత్సాహికులు మార్చి 29 లోగా దరఖాస్తు చేసుకోవాలని, ఆయా కోర్సుల ప్రవేశ పరీక్షలు ఈ నెల 30, 31 తేదీల్లో జరుగుతాయని వివరించారు.

స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోండి

సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాన్స్‌యాదవ్


భోలక్‌పూర్‌లో జరిగిన ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న డీసీపీ, ఇతర పోలీసు అధికారులు

ముషీరాబాద్: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాన్స్‌యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాల్లో సీఐఎస్ఎఫ్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌లతో కలిసి భోలక్‌పూర్ డివిజన్‌లోని ఇందిరానగర్, బొంతల బస్తీ, గుల్షన్ నగర్, పద్మశాలి కాలనీ, సుప్రీం హోటల్ తదితర ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ఎలాంటి భయభ్రాంతులకు గురికావద్దని అన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే ఎలాంటి వ్యక్తులైనా ఉపేక్షించేది లేదని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్లు, మత ఘర్షణలకు పాల్పడేవారిని ఎన్నికల సమయంలో బైండోవర్ చేస్తామని తెలిపారు. వారిపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచుతామని, పోలీసులు పిలిచినప్పుడల్లా వారు పోలీస్‌స్టేషన్‌కు హాజరుకావాలని అన్నారు. ఈ ఫ్లాగ్‌మార్చ్‌లో అడిషనల్ డీసీపీ ఆనంద్, చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్, ముషీరాబాద్ ఎస్‌హెచ్‌వో నిరంజన్, చిక్కడపల్లి ఎస్‌హెచ్‌వో సీతయ్యలతోపాటు ఎస్సైలు, పోలీస్ కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

టెట్ దరఖాస్తు ఫీజు తగ్గించండి

కాచిగూడ: తెలంగాణ టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్ –2024) దరఖాస్తు ఫీజును తగ్గించాలని, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలంగాణ బీసీ విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం టెట్, రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ సంస్థ డైరెక్టర్‌ను కలిసి టెట్ దరఖాస్తు ఫీజు తగ్గించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. గతంలో టెట్ ఒక పేపర్ దరఖాస్తు రుసుం రూ.200, రెండు పేపర్లకు రూ.300 ఉండేదని, ఇప్పుడు ఒక పేపర్‌కు రూ.వెయ్యి, రెండింటికి కలిపి రూ.రెండు వేలకు పెంచడం సరికాదన్నారు. ఫీజులను తగ్గించకుంటే జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు.

వ్యాధుల గుర్తింపునకు సర్వే


సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్

ముషీరాబాద్: వ్యాధులను గుర్తించే నిమిత్తం ఇంటింటి సర్వేతోపాటు స్క్రీనింగ్ నిర్వహిస్తున్నామని హైదరాబాద్ జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ జె.వెంకట్ తెలిపారు. ముషీరాబాద్‌లోని డాక్టర్ విజయకుమార్ దాట్ల భవనంలోని ఆరోగ్య కేంద్రంలో బుధవారం బార్కస్, నాంపల్లి సెక్టార్ల పరిధిలోని యూపీఎస్సీల వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో ఎన్సీడీ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ఆరోగ్య కేంద్రాల్లో వైద్యసేవలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఎన్సీడి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆశ్రితారెడ్డి, ఎస్పీహెచ్వోలు డాక్టర్ జయలక్ష్మి, నాగేంద్రబాబు, డాక్టర్ దీప్తి తదితరులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ న్యూ డెమోక్రసీ అభ్యర్థిగా మురళీకృష్ణ

ముషీరాబాద్: పార్లమెంటు ఎన్నికల్లో మహబూబాబాద్(ఎస్టీ) పార్లమెంటు స్థానం నుంచి సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ అభ్యర్థిగా మోకాళ్ల మురళీకృష్ణ పోటీ చేస్తున్నట్లు ఆ పార్టీకి చెందిన రెండు గ్రూపులు ప్రకటించాయి. బుధవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ నాయకులు సాదినేని వెంకటేశ్వర్‌రావు, కె.గోవర్దన్, వి.సంధ్య, ఆవునూరి మధు, జి.ఝాన్సీ, టి.శ్రీనివాస్, బండారి ఐలయ్య మాట్లాడుతూ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రెండు న్యూ డెమోక్రసీ గ్రూపులు కలిసి పోటీ చేశాయని గుర్తు చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు ఎం.శ్రీనివాస్, జి.అనురాధా పాల్గొన్నారు.

గానామృతం పంచిన ప్రసాద్



చిక్కడపల్లి: 'జబ్‌దీప్ జలే అనా' హిందీ చిత్రంలోని జేసుదాసు పాటను ప్రసాద్ గంటా సుమధురంగా ఆలపించి శ్రోతలను మంత్ర ముగ్ధులను చేశారు. బుధవారంరాత్రి శ్రీ త్యాగరాయగానసభలోని కళాదీక్షితులు కళావేదికలో సుబ్బు మ్యూజిక్ అకాడమీ నిర్వహించిన కార్యక్రమంలో హిందీ గీతాలు మధురంగా ఆలపించారు. అనంతరం ముఖ్యఅతిథులుగా ప్రముఖ గాయకులు త్రినాథరావు, వైఎస్.రామకృష్ణలు పాల్గొని మాట్లాడుతూ అమెరికాలో స్థిరపడినప్పటికీ తెలుగు, హిందీ గీతాలను మరవకుండా మధురంగా గానం చేస్తున్నారని ప్రశంసించారు. ప్రసాద్‌ను సంస్థ వ్యవస్థాపకుడు రామ సుబ్రహ్మణ్యం ఘనంగా సత్కరించారు.

సుస్థిరాభివృద్ధికి సాంకేతిక పరిజ్ఞానం దోహదం

వరల్డ్ ఉమెన్ ఫెడరేషన్ డైరెక్టర్ ఫరీదా తాంపల్


వర్క్‌షాపును జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న అతిథులు

కవాడిగూడ: సమాజ సుస్థిరాభివృద్ధి కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని వరల్డ్ ఉమెన్ ఫెడరేషన్ డైరెక్టర్ పరిదా తాంపల్ అన్నారు. దోమలగూడ ఏవీ కళాశాలలో బుధవారం 'మానవ జీవన విధానంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు' అనే అంశంపై అంతర్జాతీయ వర్క్‌షాపును నిర్వహించారు. ఫరిదా తాంపల్, ఏవీ కళాశాల కార్యదర్శి అచ్యుత ప్రసాద్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సీహెచ్ రాజలింగం, వైస్ ప్రిన్సిపాల్ పి.పద్మ జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫరీదా తాంపల్ మాట్లాడుతూ మనుషులు జంతువుల పట్ల ప్రేమతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో వీవీ సుబ్బారెడ్డి, ఆర్.మంతన, ఏవీ కళాశాల కరస్పాండెంట్ గౌతమిరెడ్డితోపాటు లెక్చరర్లు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బహుజన ముక్తి పార్టీ ఎంపీ అభ్యర్థుల జాబితా


బహుజన ముక్తి పార్టీ అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తున్న లక్ష్మణ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ బహుజన ముక్తి పార్టీ(బీఎంపీ) ఎంపీ అభ్యర్థుల మొదటి జాబితాను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అంసోలు లక్ష్మణ్ ప్రకటించారు. బాగ్‌లింగంపల్లిలోని పార్టీ కార్యాలయంలో బుధవారం అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. నాగర్‌కర్నూల్ అభ్యర్థిగా గడ్డం విజయ్, నిజామాబాద్ దేవతి శ్రీనివాస్, మల్కాజగిరి ఉప్పులేటి రాజేందర్, ఆదిలాబాద్ భూక్యరాజు, పెద్దపల్లి అభ్యర్థిగా మెయ్యి వేణుగోపాల్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ ధర్మయ్య, కార్యదర్శి ఎండీ ఫయాముద్దీన్, డాక్టర్ నరేందర్‌పవార్, మహ్మద్ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనను చూసి ఓటేయండి: కిషన్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

అంబర్‌పేట్: సుస్థిర పాలన కోసం బీజేపీని గెలిపించాలని కేంద్రమంత్రి, సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి కోరారు. బుధవారం గోల్నాక డివిజన్‌లో పార్టీ శ్రేణులతో కలిసి శ్రీనివాస టవర్స్, హ్యాపీ హోమ్స్, ఖాద్రీబాగ్, శంకర్‌నగర్ ప్రాంతాల్లో ఆయన పాదయాత్ర చేశారు. అపార్ట్‌మెంటు, కాలనీలు, బస్తీ పెద్దలతో ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ దేశం కోసం తీసుకున్న సాహసోపేత నిర్ణయాలు దేశ ప్రతిష్టను ప్రపంచ వ్యాప్తంగా చాటి చెప్పాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు, నాయకులు మూల రవీందర్‌గౌడ్, కె.రవీందర్, కాలనీవాసులు శైలేశ్వర రావు, సీఎస్ రావు, వేణుగోపాల్‌గౌడ్, దినేష్, శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణాలను కాపాడవచ్చు


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సందీప్

ముషీరాబాద్: సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్(ఎస్ఆర్‌డీ) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సీపీఆర్‌పైరాంనగర్ చౌరస్తాలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ శైలజ, నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ నుంచి డాక్టర్ సందీప్ హాజరై సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. డాక్టర్ సందీప్ మాట్లాడుతూ కార్డియాక్ అరెస్టుకు గురైనవారికి పది నిమిషాల్లో సీపీఆర్ ప్రక్రియ చేయగలిగితే ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. కార్డియాక్ అరెస్టు ఎవరికైనా రావచ్చని, సమయం, సందర్భం అంటూ ఉండదని పేర్కొన్నారు. భవిష్యత్తులో సీపీఆర్‌పై మరిన్ని అవగాహన సదస్సులు నిర్వహిస్తామని సంస్థ డైరెక్టర్ శ్రీపతి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది వి.క్రాంతికిషోర్, కోఆర్డినేటర్ ఇందిరాభారతి, శివరాణి, నీలకంఠ, రజనీ, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'కొత్త మలుపు'


సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రదర్శించిన కొత్త మలుపు నాటిక సన్నివేశం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రజాసాంస్కృతిక కేంద్రం, ఎస్వీకే సంయుక్త ఆధ్వర్యంలో మహతి క్రియేషన్స్ వారి 'కొత్త మలుపు' సాంఘిక నాటిక ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ సినీనటుడు కోట శ్రీనివాస్ రావు మాట్లాడుతూ అనాదిగా స్త్రీలు ఎలా అణచివేయబడుతున్నారో కన్నులకు కట్టినట్లుగా ఈ నాటిక ద్వారా ప్రదర్శించడం అభినందనీయమన్నారు. సుబ్బరాయ శర్మ దర్శకత్వం వహించిన ఈ నాటికలో పలువురు సినీనటులు తమ పాత్రలను పోషించి రంజింపజేశారు. ఈ కార్యక్రమంలో యండమూరి వీరేంద్రనాథ్, ఎస్వీకే కన్వీనర్ ఎస్.వినయ్‌కుమార్, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం కన్వీనర్ భూపతి వెంకటేశ్వర్లు, ఎస్వీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

'జాతీయపతాక' వారోత్సవాలు


జి.ఎస్.కేశవ్, రాజుగౌడ్‌లను సత్కరిస్తున్న జగదాంబ తదితరులు

ముషీరాబాద్: భారత జాతీయ పతాకం రూపొందించి 103 సంవత్సరాలైన సందర్భంగా ఏప్రిల్ 1వ తేదీన పింగళి వెంకయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యానగర్‌లోని రాంనగర్ గుండు వద్ద జాతీయ పతాక ఆవిష్కరణ, ప్రముఖులకు సన్మాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్‌పర్సన్ కె.హెచ్.ఎస్.జగదాంబ తెలిపారు. ఈ వారోత్సవాలలో భాగంగా బుధవారం ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు జి.ఎస్.కేశవ్, రాజుగౌడ్‌లను ట్రస్ట్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు శ్యామల్‌రావు, అనుదీప్, శ్రీకాంత్, రాకేష్, చింటూ, తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు

జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి


వేం నరేందర్ రెడ్డిని కలిసి మద్దతు ప్రకటిస్తున్న కుమారస్వామి

కాచిగూడ: బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న కృషి ప్రశంసనీయమని, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే తమ మద్దతు ఉంటుందని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్ర కుమార స్వామి తెలిపారు. బుధవారం సీఎం ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కుమారస్వామి నేతృత్వంలో జాతీయ బీసీ దళ్ ప్రతినిధులు కలిసి కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలియజేస్తూ లేఖను అందజేశారు. 17 బీసీ కులాల కార్పొరేషన్లు ఏర్పాటు చేసిందని, రాష్ట్రంలో కులగణన చేయడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. బీసీలు అన్ని రంగాల్లో రాణించాలంటే కులగణన చాలా ముఖ్యమని పేర్కొన్నారు. గాంధీ నారాయణ, సింహాద్రి, వెంకటరమణ, రాజారాం, సాయి యాదవ్ పాల్గొన్నారు.

శానిటేషన్ సిబ్బంది ఫేస్ రికగ్నేషన్


ఫేస్ రికగ్నేషన్‌ను పర్యవేక్షిస్తున్న మారుతి దివాకర్

కాచిగూడ: జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు అవకతవకలకు ఆస్కారం లేకుండా శానిటేషన్ సిబ్బంది ఫేస్ రికగ్నేషన్ సిస్టమ్‌ను చేపడుతున్నట్లు అంబర్‌పేట సర్కిల్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ మారుతి దివాకర్ తెలిపారు. బుధవారం కాచిగూడ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర నగర్ కమ్యూనిటీ హాల్‌లో శానిటేషన్ సిబ్బంది ఫేస్ రికగ్నేషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్)ను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌ఓ డాక్టర్ వై.హేమలత, జీహెచ్ఎంసీ ఎస్ఎఫ్ఏలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ అభ్యర్థులను గెలిపించండి'


ఎస్సీ మోర్చా సమావేశంలో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

కాచిగూడ: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎడెల్లి అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో జరిగిన అంబర్‌పేట ఎస్సీ మోర్చా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి బస్తీవాసులకు వివరిస్తూ బీజేపీకి ఓటు వేసే విధంగా ప్రచారం చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మంగి శివకుమార్, మహేష్, శీర్‌సాగర్, లక్ష్మణ్ కుమార్, క్రాంతి, బల్వీర్, ఎస్ఎస్ రాము, ఎడెల్లి సుధాకర్, వంగూరు సుధాకర్, మరిపెల్లి శ్రీకాంత్, ఎడెల్లి బాలాజీ, సుమన్, డి.మురళి, రవి, చంద్రశేఖర్, శివకుమార్, రజినీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి


పనులను పరిశీలిస్తున్న పావని వినయ్‌కుమార్, కృష్ణమోహన్

చిక్కడపల్లి: ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. డివిజన్‌లోని వి.వి.గిరినగర్ బస్తీలో సీవరేజ్ సమస్యలపై స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు ఈ ప్రాంతంలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా పావనివినయ్‌కుమార్ మాట్లాడుతూ డ్రైనేజీ, సీవరేజి సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించాలని బోర్డు మేనేజర్ కృష్ణమోహన్‌కు సూచించారు. ఈ మేరకు సీవరేజ్ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, నాయకులు ఎం.ఉమేష్, సాయికుమార్, బస్తీ వాసులు శ్రీనివాస్, సాయికృష్ణ, శాంతికుమార్, సాయి, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘరానా దొంగ అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రమేష్, సీఐ సీతయ్య

చిక్కడపల్లి: తప్పించుకు తిరుగుతున్న ఓ ఘరానా దొంగ ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. చిక్కడపల్లి క్రైమ్ పోలీసులు బుధవారం చాకచక్యంగా పట్టుకుని అతడి నుంచి రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య, క్రైమ్ ఎస్ఐ కోటేశ్వర్‌రావుతో కలసి చిక్కడపల్లి ఏసీపీ ఎల్.రమేశ్ కుమార్ వివరాలు వెల్లడించారు. ఏపీలోని గుంటూరు జిల్లాకు చెందిన చాగంటి పవన్ తిరుమలేష్ విలాసవంతమైన జీవితానికి అలవాటుపడ్డాడు. మద్యం, గంజాయి వంటి చెడు అలవాట్లకు బానిసయ్యాడు. అతడు ఖరీదైన వాహనాలను దొంగిలించడం అలవాటుగా మార్చుకున్నాడు. ఈ క్రమంలోనే గుంటూరు, విశాఖపట్నం, వరంగల్, నల్లగొండ, ప్రకాశం, హైదరాబాద్ తదితర నగరాలు, జిల్లాల్లో అతనిపై పలు కేసులు కూడా నమోదయ్యాయి. ఇటీవల జైలు నుంచి విడుదలైన అతడు బుధవారం చిక్కడపల్లి పీఎస్ పరిధిలో చోరీకి గురైన వాహనంపై అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో క్రైమ్ పోలీసులు పట్టుకున్నారు. నాంపల్లి క్రిమినల్ కోర్టు 9వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా అతనికి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించారు. నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న చిక్కడపల్లి క్రైమ్ స్టాఫ్‌ను ఏసీపీ ప్రత్యేకంగా అభినందించారు.